క్లుప్తంగా

జర్నలిస్టులకు ప్రమాద బీమా



జర్నలిస్టులకు బీమా కార్డులు అందిస్తున్న కరణం రామానందన్

లేపాక్షి: మండల వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులకు లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తన సొంత ఖర్చుతో తపాలా ప్రమాద బీమా చేయించారు. ఇందులో భాగంగానే సోమవారం స్థానిక వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో జర్నలిస్టులకు బీమా కార్డులను అందించారు. నిరంతరం సమాజ హితానికి పాటుపడే జర్నలిస్టులకు అండగా ఉంటానని రామానందన్ తెలిపారు. బీమాకు సంబంధించిన ప్రీమియాన్ని కూడా కచ్చితంగా తానే కడతానని హామీ ఇచ్చారు. అంతకు ముందు హిందూపురం ప్రెస్‌క్లబ్ శాశ్వత అధ్యక్షుడు రాంప్రసాద్‌తో పాటు స్థానిక జర్నలిస్టులు చైర్మన్‌ను సన్మానించారు.

ఉపాధి బిల్లులు చెల్లించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

లేపాక్షి: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రవీణ్, ప్రేమక్క, చంద్రకళ, నరసింహప్పలు ఎంపీడీఓ వాసుదేవగుప్తాకు సోమవారం వినతిపత్రం అందించారు. గత మూడు నెలలుగా బిల్లులు రాలేదని, ఉపాధి పనులకు రావడానికి కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కూలీలకు వెంటనే బిల్లులు చెల్లించాలని, ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రుచికరమైన భోజనాన్ని వడ్డించండి



రంగనపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పెన్సిళ్లు అందిస్తున్న ఎంఈఓ

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మెను ప్రకారం రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రంగనపల్లి, అలుపనపల్లి, పిల్లిగుండ్ల ప్రాథమిక పాఠశాల, కన్నడ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల వ్యాప్తంగా 65 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను పరిశీలించి ప్రదర్శించారు.

రొళ్లలో క్షుద్ర పూజలు



రంటవాళకు వెళ్లే మార్గం పక్కన క్షుద్రపూజలు చేసిన దృశ్యం

రొళ్ల: మండలంతో పాటు కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో విచ్చలవిడిగా క్షుద్ర పూజలు జరుగుతున్నాయి. ఆది, సోమవారం రెండు రోజుల పాటు అమావాస్య కలసి రావడంతో అర్ధరాత్రి వేళ రొళ్ల మండల పరిధిలోని జాతీయ రహదారి వన్నారనపల్లి క్రాస్ నుంచి వయా శివబాలయోగి నగరం గుండా కర్ణాటక రాష్ట్రం రంటవాళ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు (దొమ్మరహట్టి) గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన మూడు కూడళ్లలో క్షుద్ర పూజలు చేశారు. పెద్ద పెద్దగా పిండితో బొమ్మలు తయారు చేసి ఉంచి యంత్రాలు, తాయత్తులు, నిమ్మకాయలు, పసుపు, కుంకుమ చెల్లి పూజలు నిర్వహించారు. దీంతో అటుగా వెళ్లే ప్రజలతో పాటు వివిధ గ్రామాల నుంచి పిల్లలు పాఠశాలకు వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు. క్షుద్ర పూజలు చేసే వారిపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తికి గాయాలు

పెనుకొండ రూరల్: పెనుకొండ పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారిలో హరిపురం వై జంక్షన్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు అవినాష్ గుప్తా అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నాడు. అయితే వై జంక్షన్ వద్ద బైక్‌ను వెనుక వైపు నుంచి లారీ ఢీ కొంది. గాయపడిన అవినాష్ గుప్తాను పెనుకొండ ఆస్పత్రికి తరలించారు.

నేడు గదుల వేలం

గుడిబండ: మండల పరిధిలోని మందపల్లి గ్రామ పంచాయతీలో ఉన్న ఆరు షాపింగ్ కాంప్లెక్స్ గదులకు మంగళవారం ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అశ్వత్, ఈఓఆర్డీ నాగరాజు నాయక్ తెలిపారు. రూ.30 వేలు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చున్నారు.

వక్క.. లాభాలు పక్కా

కిళ్లీ, తాంబూలంలో వినియోగించే వక్క సాగు కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో రైతులు అధికంగా సాగు చేస్తారు. ఆ తర్వాత జిల్లాలోని మడకశిర ప్రాంతంలో రైతులు వక్కసాగును చేపడుతున్నారు. అయితే తాజాగా సోమందేపల్లిలోని పలువురు రైతులు కూడా వక్క సాగుకు మొగ్గు చూపుతున్నారు. వక్క తోటకు శ్రమ, చీడపీడలు, పెట్టుబడులు, కూలీల సమస్య చాలా తక్కువ కావటంతో కర్షకులు ఆ దిశగా అడుగులేస్తున్నారు.



ఓబుళదేవరపల్లిలో వక్క సాగు చేస్తున్న రైతు

- వక్క సాగు వైపు మొగ్గుచూపుతున్న సోమందేపల్లి రైతులు
- ఐదేళ్లు కాపాడితే సుదీర్ఘ కాలం దిగుబడి
- శ్రమ, చీడపీడలు పెద్దగా ఉండవంటున్న కర్షకులు

సోమందేపల్లి: మండలంలోని రైతులు కొత్తతరం పంటలపై దృష్టిసారిస్తున్నారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో ఎక్కువగా సాగు చేసే వక్కతోటలు మండలంలో కూడా సాగు చేసేందుకు సన్నద్ధమయ్యారు. కర్ణాటకలోని పావగడ, శివమొగ్గ ప్రాంతాల నుంచి వక్క మొక్కలు తీసుకువచ్చి నాటుతున్నారు. తుంగోడు, చల్లాపల్లి, ఓబుళదేవరపల్లి గ్రామాల్లో రైతులు వక్క చెట్లను పెంచుతున్నారు. ఇతర పంటలు పెట్టి నష్టపోవడం కన్న ఒక్కసారి వక్క చెట్టు నాటి ఐదేళ్ల పాటు వాటిని సంరక్షించుకుంటే కాసుల వర్షం కురిపిస్తుంది అని రైతులు చెబుతున్నారు.



తుంగోడులో డ్రిప్ సాయంతో వక్క తోట సాగు చేసిన రైతు

ఐదేళ్లకు దిగుబడి

రైతులు తమ పొలంలో అంతర పంటలలో పాటు ఎకరాకు 700 దాకా వక్క మొక్కలు నాటుతున్నారు. డ్రిప్ వక్క మొక్కలకు నీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం నాటే మొక్కలు ఐదేళ్ల తర్వాత దీర్ఘ కాలం దిగుబడిని ఇస్తాయని వారు చెబుతున్నారు. ఇతర పంటలకు ఖర్చు అధికంగా ఉంటుందని, అయితే వక్కకు పెట్టుబడి తక్కువగా ఉండటంతో పాటు కూలీల అవసరం పెద్దగా ఉండకపోవడంతో రైతులు ఈ పంటలపై ఆసక్తి కనబరుస్తున్నారు. చెట్లకు అవసరమైన మేరకు నీరు, పేడ, మట్టిని అందిస్తే చాలు. పెద్దగా ఖర్చు చేయాల్సింది లేదు. ధరలు నిలకడగా ఉండటంతో రైతులు నిశ్చింతగా ఉండొచ్చు. ఒక్కసారి పంట సాగు చేస్తే 45 సంవత్సరాల వరకు అదాయం వస్తూనే ఉంటుంది.

ఖర్చులు తక్కువే..



ఇతర పంటలు సాగు చేయడానికి ఖర్చులు అధికంగా ఉంటాయి. కూలీల డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. కానీ వక్కతోట పెంపకానికి ఒకసారి మొక్క నాటితే చాలు ఐదేళ్ల తరువాత ప్రతి ఏడాది పంట చేతికి వస్తుంది. నాలుగేళ్ల కిందట పంట పెట్టాను. అప్పుడే వక్క చెట్లకు కాయలు వస్తున్నాయి.

– ఆదెన్న, రైతు చల్లాపల్లి

సుదీర్ఘ కాలం దిగుబడి



గతంలో ప్రతి ఏడాది వేరుశనగ, మొక్కజొన్న పంటలు సాగు చేసే నష్టాలు కొని చూసేవాళ్లం. అయితే ఒక్కసారి వక్కపంట సాగు చేస్తే సుదీర్ఘ కాలం పంట ప్రతి ఏడాది చేతికి వస్తుంది. దీంతో కర్ణాటక నుంచి మొక్కలు తెచ్చి వక్క సాగు చేపడుతున్నాను.

– ప్రతాప్, రైతు, తుంగోడు

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



కర్ణాటకలోని షిమోగా నుంచి వక్క మొక్కలు తీసుకొచ్చి పంట పెడుతున్నాను. గతంలో మొక్కజొన్న సాగు చేస్తుండేవాడిని. ఏదో ఒక కారణంతో పంట నష్టపోయేవాడిని. దీంతో వక్క సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయనే వెయ్యి మొక్కలు పెంచుతున్నా. ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.

– పురుషోత్తం, ఓబుళదేవరపల్లి

రైతులను ఆదుకోవాలి

సోమందేపల్లి: తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేయాలని సీపీఐ నాయకులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పంట పెట్టుబడి రూ.20 వేలు అందించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధంగా రూ.2 లక్షల రుణాలు మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాలస్వామి, ఆంజేయులు, నూర్జహాన్, భారతి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చు

పెనుకొండ: క్రమశిక్షణ ఒక ఆయుధమని వ్యక్తిత్వ వికాస నిపుణులు రాధాకృష్ణరావు పేర్కొన్నారు. పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై ఆయన అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగితే ఉన్నత లక్ష్యాలకు ఎలా చేరుకోవచ్చో వివరించారు. కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు



పెనుకొండ: పెనుకొండ డీఎస్పీగా ఆర్ల శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనుకొండ ప్రాంతంపై తనకు గతంలో నుంచి మంచి అవగాహన ఉందన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఇందులో భాగంగా ప్రతి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి ఆ ప్రాంత విషయాలపై ఆరా తీస్తానన్నారు. ప్రజలు న్యాయం కోసం ఏ సమయంలోనైనా తనను సంప్రదించవచ్చని సూచించారు.

వృద్ధురాలి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోండి

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని పాత ఊరులో నాలుగురోజుల క్రితం కారు ఢీ కొని దళిత వర్గానికి చెందిన వృద్ధురాలు లక్ష్మమ్మ మృతి చెందింది. ఇందులో భాగంగానే ఆమె మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య మాట్లాడుతూ ఈ సంఘటనపై అన్ని విషయాలు తెలిసినా కూడా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. కేసు నమోదు కాకుండా మధ్యవర్తుల ద్వారా దుప్పటి పంచాయితీలు చేసి దళిత వృద్ధురాలి కుటుంబానికి అన్యాయం చేసిన వారిపై ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు రమణ, పెద్దన్న, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కేవీపీఎస్ నాయకులు





ద్విచక్ర వాహనంలో ఉన్న విష పురుగును చూస్తున్న ప్రజలు, పాముని చంపేసిన దృశ్యం

ద్విచక్ర వాహనంలో పాము


మడకశిరరూరల్: పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లోని ఓ టీకొట్టు వద్ద తిప్పేస్వామినాయక్ అనే వ్యక్తి సోమవారం తన ద్విచక్ర వాహనాన్ని ఆపాడు. పని ముగించుకొని తిరిగి వస్తుండగా బైక్‌లోకి విష పురుగు ప్రవేశించడం చూశాడు. స్థానికులంతా గుమిగూడి ఆఖరికి ఆ పామును చంపేశారు.

సజావుగా సర్వసభ్య సమావేశం

అగళి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రేణుక అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎంపీపీ రేణుక మాట్లాడుతూ మండలస్థాయి అధికారుల తమ నివేదికను చదివి వినిపించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి శేఖర్‌నాయక్ మాట్లాడుతూ. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. రైతులకు ఇంతవరకూ ఇన్‌పుట్ సబ్సిడీ పడిందా? సంక్షేమ పథకాలు అందాయా? అని ప్రశ్నించారు. 1200 నుంచి 1500 మంది రైతులకు ఈ-కేవైసీ సమస్య వలన పడలేదన్నారు. ప్రతి రైతుకు సంక్షేమ పథకాలు వర్తించేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. ఎంఈఓ భాస్కర్ నాడు - నేడు పథకం ద్వారా పాఠశాలల్లో జరిగిన అభివృద్ధిని వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఉమేష్ ,వైస్ ఎంపీపీ, గాయత్రి, నిర్మలమ్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



అలంకరణలో రొళ్ల మండలం కాల్వేపల్లి రంగనాథస్వామి



గుడిబండ: ప్రత్యేక పూజలు అందుకున్న మల్లేశ్వరస్వామి



అమరాపురం: అలంకరణలో చెరువు ఆంజనేయస్వామి

శ్రావణ మాస పూజలు ప్రారంభం

రొళ్ల /అమరాపురం/గుడిబండ/పావగడ: శ్రావణ మాసం సోమవారం ప్రారంభం కావడంతో మడకశిర నియోజకవర్గంలో వివిధ ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆయా ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి పూజల్లో పాల్గొన్నారు. పావగడలోని శనేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. శనీశ్వరునితో పాటు శీతలాంబదేవికి ప్రత్యేక పూజలు చేశారు.



పావగడ: శనీశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

పరిగి: పుట్టిన నిమిషం నుండే నవజాత శిశువుకు తల్లి పాలను తాగించడమే శ్రేష్టమని అమ్మ పాలు బిడ్డకు అమృతంతో సమానమని పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరెడ్డి, డాక్టర్ నవీన తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో బాగంగా సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల వారోత్సవాలపై అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం పుర వీధుల్లో అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరాణి, సీహెచ్‌ఓ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: తల్లి పాలు బిడ్డకు అమృతం వంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ తెలిపారు. సోమవారం పట్టణంలోని 9వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు 6 నెలల పాటు తల్లిపాలు తాపించాలన్నారు. తల్లిపాలు ప్రాముఖ్యతపై తల్లులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని బిసలమానేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ రెడ్డిరమణమ్మ, సూపర్‌వైజర్లు మంజుల, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పరిగి: తల్లి పాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

గోరంట్ల: పట్టణంలోని కొలిమిచింతమాను వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు తల్లులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి రమణ మాట్లాడుతూ తల్లి.. బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లికి , బిడ్డకు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. తల్లి పాలలో పోషక పదార్థాలు అధికంగా ఉంటాయని, దాని వల్ల బిడ్డల ఎదుగుదలకు ఎంతో దోహదనం చేస్తాయన్నారు.

అగళి: తల్లిపాలు బిడ్డలకు దివ్య ఔషధంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి అన్నారు. నందరాజనపల్లి అంగన్వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.



లేపాక్షిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



అగళి మండలంలోని నందరాజనపల్లిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

సంక్షిప్త సమాచారం

రూ.20 వేలు ఇచ్చి హామీ నిలుపుకోవాలి

హిందూపురం టౌన్: వర్షాలు లేక నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేలా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పంట పెట్టుబడి సాయం రూ.20 వేలను రైతులకు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎస్‌డీటీ హారతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్, సీపీఐ కార్యవర్గ సభ్యులు రవికుమార్, కమల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆ స్థలం పట్టాదారుడిదే..

పెనుకొండ: పట్టణంలోని మడకశిర రహదారిలోని కోనాపురానికి వెళ్లే దారిలోని స్థలం పట్టాదారుడు సుధాకరరెడ్డిదే. అది ప్రభుత్వ, పోరంబోకు భూమి కాదని నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డికి చెందిన స్థలం (681 సర్వేనంబర్) అప్రోచ్ రోడ్డుదని కొందరు ఆదివారం ధర్నాకు దిగారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆ భూమి పట్టాదారునికి చెందినదని తేల్చారు.

పెనుకొండ తహసీల్దార్‌గా శ్రీధర్

పెనుకొండ: పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా రామకుప్పం నుంచి ఆయన బదిలీపై పెనుకొండకు వచ్చారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: ప్రభుత్వ హాస్టల్‌లోని విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6న కలెక్టరేట్ కార్యాలయం వద్ద చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక సప్తగిరి కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, నియోజకవర్గ అధ్యక్షుడు దేవరాజు, నాయకులు మహేష్, నాగేంద్ర, వరుణ్, భార్గవ్, ఆదర్శ, రాజేష్, వినయ్, రాకేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి

పెనుకొండ: వర్షాభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. అలాగే అధికార పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలని కోరారు. నాయకులు బాలస్వామి, చాంద్ బాషా, అంజనేయులు, ఈశ్వరప్ప రైతులు పాల్గొన్నారు.

దాడి కేసులో 15 మందికి జరిమానా

రొద్దం: మండల పరిధిలోని కోగిర గ్రామంలో 2015లో జరిగిన దాడి కేసులో 15 మందికి పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి బుజ్జప్ప రూ.2,600 జరిమానా విధించారు. క్రైం నంబర్ 7/14 అండర్ సెక్షన్ 147, 149, 324/277/15 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు ఎస్ఐ వలిబాషా, కోర్టు కానిస్టేబుల్ కృష్ణ తెలిపారు. కేసును పీపీ శ్యామల వాదించినట్లు పేర్కొన్నారు.

ఈ పంట నమోదు ప్రక్రియ ప్రారంభం

హిందూపురం అర్బన్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు ఏడీ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. రైతులు ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ లేకపోతే వన్‌బీ, బ్యాంక్ పాసుపుస్తకం , దరఖాస్తు ఫారంతో ఆర్‌బీకేలోని వ్యవసాయ సిబ్బందికి ఇవ్వాలన్నారు. వారు వచ్చి ఈ క్రాప్ నమోదు చేస్తారన్నారు. ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

మహిళకు రక్తదానం

హిందూపురం టౌన్: అత్యవసర పరిస్థితిలో చికిత్స పొందుతున్న మహిళకు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రాధ అనే మహిళ రక్తదానం చేసింది. సంధ్యాబాయి అనే మహిళ అనీమియాతో బాధపడుతుండగా సోమవారం అత్యవసరంగా రక్తం అవసరమైంది. అల్ ఇందాద్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అమన్ స్పందించి రాధ అనే మహిళ ద్వారా రక్తదానం చేయించారు. స్పందించి వెంటనే ఆస్పత్రికి వచ్చి రక్తదానం చేసిన రాధను వైద్యులు అభినందించారు.

'సుప్రీం' తీర్పును అమలు చేయండి

మడకశిరరూరల్/లేపాక్షి/పావగడ: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో మడకశిరలోని రేకులకుంటలో దళిత సంఘాలు సంబరాలు చేసుకున్నారు. అలాగే లేపాక్షి మండలంలోని పులమతి, సడ్లపల్లి గ్రామాల్లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం దశాబ్దాల నుంచి పోరాటం చేయడంతోనే ఫలితం దక్కిందన్నారు. మరోవైపు సుప్రీం తీర్పును వెంటనే అమలు చేయాలని పావగడకు చెందిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు తిప్పేస్వామి, వళ్లూరు నాగేశ్, హనుమంతరాయప్ప, మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు తాలూకా కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.